

# పురాణాలలో వుందిట!

శ్రీ కాజ వెంకట పద్మనాభరావు.

'రామూ! ఈ గోపుర మేమిటి?'

'దీనినిగురించి కొంచెము ఆపక్క రాసివుంది' నా మిత్రుని, విద్యార్థిని స్మారకచిహ్నము'

'వారినిగురించి చెప్పు, రామూ! నాకు వినాలని వుంది'

'దీనిని తలచినపుడల్లా నాగుండె బరువెక్కుతుంది. తలచకుండా వుండాలని ఎంతో ప్రయత్నంచేస్తా నాకు చేతకావటంలా. ఎవరితో అన్నా చెప్పినపుడు హృదయభారం కొంత తగ్గుతుంది. లేకపోతే దుఃఖ సముద్రములో ఎంతసేపో వుక్కిరి బిక్కిరై తన్నుకోవలసి వస్తుంది.

"నేను జైలునుండి వొచ్చినతోడనే యీవూరు చేరి వ్యవసాయము మొదలుపెట్టాను. మాచేలో పని చేయువారందరు మాలమాదిగలే. అంచేత వారి కష్టనష్టములన్నీ నా కర్థ మవుతుండేవి. ఈవూరినిండా బ్రాహ్మణులున్నారు. వీరిదే ప్రభుత్వమిచ్చట. వేరు ఏమన్నా అయితీరవలసినదే. వీరు పూర్వాచారపరులు. మాలమాదిగలంటే చాల హీనముగా చూస్తారు. వారిచే పనిచేయించుకొని సరిగా కూలి యియ్యక, ఏమైనా తినేవాళ్లకి గింజలెందుకురా!' అని హేళనచేస్తారు. వారిని దగ్గరకు రానియ్యరు. కొంత మంది వారితో మాట్లాడి స్నానముచేస్తారు మనుష్య జాతిలోనుండి వారిని సంపూర్ణముగా వెలివేశారు.

ఈ అన్యాయము చూస్తూన్న కొద్దీ నాకు ఎక్కడలేనికోపం వచ్చేది. వారి నెందుకు అలా బాధించాలి? వారికి మనిషివున్న అవయవాలు లేవూ,

మనిషి మాట్లాడినట్లు మాట్లాడలేరూ? మనిషివలె సంచరించలేరూ? వాళ్లయిల్లు చాల మురికితో అసహ్యాముగా, అనారోగ్యముగా వుంటాయి అంటారు. బంగారము మురికిలో వుందని పారేస్తోన్నారా? శిశువు, ఉదరములోనుంచి వస్తోందని, చంపేస్తున్నారా? —మరి వీరి అశుభ్రతకు ఎవరుకారణం? నాగరికులమని, విద్యాధికులమని చెప్పుకొని, తమ సోదర మానవులు నీచస్థితిలో వున్నపుడు వారిని ఉద్ధరించుటకు ప్రయత్నించని, అజ్ఞానులు, మూఢులు, స్వార్థపరులు, దయారహితులు.

"నేనిచ్చట యీ హరిజనపాఠశాలపెట్టి మాల మాదిగిలను చేరదీసి మహాత్ముని తత్వం బోధపరచటము మొదలుపెట్టా. వెంటనే నన్ను బ్రాహ్మణులలో నుండి వెలివేశారు. ఎటువంటి సహాయమూ చేయమని భయపెట్టారు. నాటినుండి నాకు అన్ని సహాయములు యీ హరిజన సోదరులే చేస్తున్నారు.

రోజులు గడుస్తున్నాయి. చాలమంది హరిజన బాలికలు బాలురు యీ పాఠశాలలో చదువుకుంటున్నారు. చూడు, అందరును ఎలా పరిశుభ్రముగ-ఆరోగ్యముగ వున్నారో! ఇపుడు యీ వూరిలో కల్లా యీహరిజన పల్లెయే శుభ్రతగా వుంది. వీరికి మానవ ప్రపంచములో చోటులేదూ?

ఇలా ఐదు సంవత్సరాలు గడిచాయి. ఓనాడు తలవని తలంపుగా మాధవుడు—మాధవరావు ఎరుగవూ?

'బెనారెసులో చదువుచున్నాడు యింజనీరు కొడుకు, అతడేనా?'

'ఆ!...'

'ఏదో ఓమారు చూచాను.'

అతను. వాళ్లి చెల్లెలిక్కడ వుంటే చూచిపోదామని వొచ్చాడు. నా సహపాఠి చదువుకున్న రోజుల్లో. మేము చాల అన్యోన్యముగా మెలిగే వాళ్ళము. నేనిచ్చట వున్నానని విని నన్ను చూడ్డానికి స్కూలుకు వచ్చాడు.

'రామూ! నాకూ చాల సంతోషముగా వుంది, —ముఖ్య స్నేహితుడవు నీవు యిలా దేశసేవ చేస్తోంటే. నీవు అపుడు జైలులో పడ్డ తరువాత నీ సంగతే నాకు సరిగా తెలియలేదు' అన్నాడు మాధవుడు.

'నేను ఒక జైలులో వుంటే కదూ? చాల చోట్లకి మార్చారు. జైలులో వుండగా నా తండ్రి మరణించాడు. అంచేత మా స్వంత వ్యవహారాలు—వ్యవసాయము మొదలైనవి నా నెత్తిన పడ్డవి. ఈ మూల ఓ పాఠశాల పెట్టుకొని పనిలేనపుడు యీ హరిజనసోదరులతో కాలము గడుపుతున్నా.'

'నీవు దేశమునకు ఎంతో సేవచేస్తున్నావు రాము! నీవు నిజముగా ధన్యుడవు! ఏదీ పాఠశాల అంతా చూడనీ.'

లోపలికి తీసుకొపోయి అంతా చూపుతున్నా.

'రామూ! ఈ పటం చూడు చాల బాగుంది. ఎవరు వ్రాశారు—సరోజినియా? ఎవరు ఆమె?'

'ఆమె యీ బాలిక. తెలివిగలది. తెలుగుతో పాటు, హిందీ, యింగ్లీషు చదువను వ్రాయను వొచ్చు. సంగీతము, చిత్రకళ పుట్టుకతోనే వొచ్చాయి.'

సరోజని పదునైదు సంవత్సరముల బాలిక; చక్కని చామనచాయ. ప్రేమయొక్క జన్మస్థానం యిదియా అన్నట్లు నేత్రాలూ, లేత చిరునవ్వు గలిగిన ఆ గులాబీ పెదిమెలూ, మృదువైన బుగ్గలమీగ నవ్వుచే ఏర్పడే చిన్ని గుంటలూ, తెల్లనిపూలు ధరించిన నల్లని జుట్టూ, ఆరోగ్యముతో ప్రకాశించు ఆ శరీరము ఖాదీ బట్టలు ధరించడము, చూస్తే దేవతా స్వరూపంలా వుంది.

'మధూ! నీవున్న నాల్గురోజులూ యీ మెకు కొత్త సంగతులుంటే చెపుతూ, సందేహాలుంటే తీరుస్తుండు.'

'రామూ! అంతకన్నానా!' అన్నాడు.

* * *

"మాధవుడు రాకరాక పల్లెటూరొచ్చాడు. పట్నవాస సుఖంకన్నా, పల్లెటూరులోనే ఎక్కువ ఆనంద ముందని గ్రహింపగలిగాడు. ఎక్కువ కాలము మా స్కూలునందే గడిపేవాడు. ఇది అతని చెల్లెలికి బావకు యిష్టము లేకపోయినా ఏమీ అనలేకపోయారు. కాని ఊరంతా యితనిమీద విరుచుకొని పడడానికి ప్రయత్నిస్తుందని మేము గ్రహింపకపోలేదు. తగిన జాగ్రత్తతో మెలుగుతుండే వారం.

"సరోజని తనకు తెలియని విషయాలు అతనిని అడుగుతుండేది. ఆమె సంశయాలను తీర్చుట అతనికెంతో సరదాగావుండేది. ఆమె దగ్గర అతనూ అనేక విషయాలు- స్వదేశాభిమానము, పట్టుదల, శాంతము మొదలయినవి- నేర్చుకోగలిగాడు. అతడు అపుడపుడు అంటూవుండేవాడు, 'పాపం! ఈ పల్లెలలో యిలాటి వారు ఎంతమంది తగినపోషణ లేక, మహాసాగరము లోని ముత్యములలాగ, దేనికీ పనికిరాకుండా పోతున్నారో!' అని

"ప్రతి సాయంసమయం, నేను, మాధవుడు, సరోజనీ, స్కూలుతోటలో అ తెల్లని యిసుక తిన్నెమీద కూర్చుని అనేక విషయాలు కులాసగ మాట్లాడుకునే వాళ్లం. అందరిలో సరోజని అంటే నాకు చాల యిష్టం; ఎందుకంటే ఆమె వృద్ధిలోకి రాదగిన బాలిక; ఆమెను గొప్పస్థితికి తీసుకువచ్చి, నాగురూత్వం సార్థకము చేసుకోవాలి అని నా ఆశ. ఆమె మాతో సమముగా అన్ని విషయాలు చర్చించుతుండేది. ఆమె పలుకులు ఎపుడూ వింటుండా లనిపించేది. ఆమె అతని స్నేహము కోరుతున్నట్లు అపుడపుడు కన్నులతో కనపర్చేది. అది అతను గ్రహించకపోలేదు. వెళ్లిపోయేముందు ఆమె ఓ చక్కని పాటపాడేది. మాతోపాటు చెట్లుకూడా తలలూపేవి ఆ మధురగానం విని.

* * *

"ఓ రోజున సాయంకాలము. నేను పొలంపని మీద వెళ్లాను అతను, సరోజనే ఆనాటి సభ అలంకరించవలసి, వొచ్చింది. మాధవుడు నా దగ్గర ఎటువంటి విషయాలూ దాచడు. అంచేత నేనిలా చెప్పడానికి వీలైంది, వారిద్దరు మామిడి చెట్టుకింద కూర్చున్నారు. చెట్టు కొమ్మలనుండి వేడిమిలేని అతుది ఎండ ఆమె మృదువైన బుగ్గలమీదా, గోధుమ రంగు ఖద్దరు చీరెమీదా పడి ఆమె అందాన్ని పెంపొంద చేస్తోంది. పిల్లగాలికి రేగిన ముంగురులు ముఖముమీద చిందులాడు తున్నాయి- పద్మము మీద తుమ్మెదల నృత్యములాగ.

'సరోజనీ! ఏవీ నీ చిత్తరువులు?'

"ఓ బొత్తి చిత్తరువులు అతని కిచ్చింది. ఒక్కొక్కటి తీసిచూట్టం మొదలు బెట్టాడు. వాటిలో ప్రకృతి అనేక విధముగా ఆకర్షణీయముగా వ్రాయబడ్డది. ఇంకా కొన్ని తీయగా ఓ పురుషుని చిత్రము కనిపించింది. అది సరిగా అతన్నిపోలే వుంది; అది అతనికే అంకితం యివ్వబడినట్లు వ్రాసి వుంది.

'సరోజనీ! ఇది నీవెప్పుడు వ్రాశావ్?...తిరిగి ఏమి బహూమానము యివ్వగలనూ?' అన్నాడు, సంతోషముతోనూ, తగిన బమామతి లేదను ఆ సంతృప్తి హృదయంతోనూ.

'మీరు నన్ను మరువకుండిన అదియే చాలు.' అంటూ క్రీగంటి చూపులతో చిరునవ్వు నవ్వుతూ తల వొంచుకుంది.

ఆ చూపులో అర్థముంది.

'అదేమిటి సరోజనీ నా జీవితములో నిన్ను మరువగలనా?'

'అబ్బే! ఊరికే అన్నాలెండి'

'..............'

'..............'

'అలాచూడు సరోజనీ! నాగుపాములవలె పడగవిప్పి ఆడుతూ యెలా ముద్దుపెట్టుకుంటున్నాయో ఆరెండుగుమ్మడిపూలూ!......మనమిద్దరం ఆపువ్వులమైతే......!'

సిగ్గుచే ఎఱ్ఱబారినముఖాన్ని చిరునగవుతో కిందకు వంచింది.

'సరోజనీ! నేనిచ్చట రెండు రోజులుండి పోదామని వచ్చా, కాని నీవు నా హృదయాన్ని దొంగిలించి యిన్ని రోజు లుంచావు'

'నాతప్పు క్షమించాలి; మీరు బ్రాహ్మలు నేనో హరిజనబాలికను. మీకోర్కె నెరవేరదు మీరు పడరాని కష్టము పాలగుదురు నేను మీతో దేశసేవచేయుచు మీ సమీపముననే వుండెదను.'

"సరూ! తుమ్మెద పుష్పమునుచూచి సంతోషిస్తుంది; తృప్తిపడదు."

గాలికి ఆమె జడ—దెబ్బతిన్న నల్లత్రాచులా గిలగిల కొట్టుకుంటోంది. జడేకాదు, భావాలుకూడా. చాలసేపు యిద్దరు మాట్లాడలేదు. సంధ్యారుణ కాంతి ఆమె పెదవులలో దాక్కుంది. లేతవెన్నెల అపుడే ప్రవేసిస్తూంది.

"సరూ! నేను దేశసేవకై పాటుపడవలె నన్ను నీవునాలో కలిసిపోవాలి. ప్రపంచం నిన్ను అసహ్యించుకుంటుం దనుకుంటావేమో! ముందు నన్ను అసహ్యించుకున్నాక నీవంకకు తిరుగుతారు.'

'నావలన మీ కీర్తికి భంగము'

దానికేమి సరూ! మన ఉద్దేశాలు మంచివి, నిష్కపటమైనవి; అయితే మనం వాటిని ధైర్యంగా అనుభవిద్దాం ఎన్ని కష్టాలొచ్చినా.'

'...................'

'లోకులు యేమనుకుంటేయేం? వాళ్ళకు చెవులున్నాయి. కళ్లులేవు'

హృదయ కినాటాలు తెరుచుకున్నాయి. ప్రణయభావ వాయువులు పచార్లు చేస్తోన్నాయి.

* * *

"ఆ రోజు హరిజనపల్లె అంతా అందంగా అలంకరింపబడ్డది. అందరూ చాల సంతోషముగా వున్నారు. సరోజనీ మాధవుల వివాహము చాల జయప్రదముగా జరిగింది. పల్లెలోని పెద్దలు నిష్కళంక ప్రేమతో ఆశీర్వదించారు. నూతన దంపతులు చిలుకా గోరువంకల్లాగు చాలఅన్యోన్యముగా, అందముగావున్నారు. నా కెక్కడిలేని ఆనందము కలిగింది. గర్వము కలిగింది. నా మనోరథము లీడేరెను. నా జీవితము తరించింది. నా కింతకంటె యింకేమి కావలెను?

"సంతోషము క్షణభంగురమని మరిచిపోయినా, నీటి బుడగలు శాశ్వతములని నమ్మి మనుష్యజాతి మా పనిని మెచ్చుకొని ఆనందిస్తోందని తలిచాను.

.....ఊరిలో గుసగుసలు బయలుదేరాయి.

మరునాడు ఉదయము ఆ గోపురపు స్థలములో మాధవుని శవము రక్త ప్రవాహములో యీదులాడుతూంది. వీధిలో గోలకు సరోజనీ నిద్రనుంచి మేలుకొని బయటికి వచ్చింది. శవమునుచూస్తూ అలాగే నుంచుంది రెప్పవాల్చకుండ. నేను ఆమెను మెల్లగ పట్టుకున్నాను, ఆమె శవము నా చేతులలో వ్రాలింది.

ఊరిలోని శాస్త్రవేత్తలు, 'బ్రాహ్మణులు, మాల మాదిగలను తాకుతే పాపం; వారితో సంబంధముచేసిన మహాపాతకము. అంచేతే అతడు తలపగిలి మరణించాడు' అని చెపుతున్నారు. ఇది పురాణాలలో వుందిట!